జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
భద్రాద్రి కొత్తగూడెం
మంగళవారం | 26 | మే | 2026 ◆ పేజీలు : 7

# ముఖ్యమంత్రిని కలిసిన ఎమ్మెల్యే కోరం

- -మున్సిపాలిటీ అభివృద్ధి కోసం రూ. 50 కోట్లు కేటాయించాలని వినతి



**ఇల్లందు, మే 25, ప్రజాజ్యోతి:** హైదరాబాదులోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని సోమవారం ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య మర్యాదపూర్వకంగా కలిశారు. ఇల్లందు మున్సిపాలిటీ అభివృద్ధి కోసం రూ. 50కోట్ల నిధులు కేటాయించాలని వినతిపత్రం అందజేశారు. ఇల్లందు మున్సిపాలిటీలో ప్రధానంగా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, వాటర్ పైప్ లైన్, నీటి శుద్ధికరణ, మున్సిపాలిటీ శుద్దీకరణకు ఆధునిక పరికరాలు, రోడ్లు, కల్వర్టుల ఆధునికరణ, నూతన నిర్మాణాల మంజూరు తో పాటు నిధులను సైతం మంజూరు చేయాలని కోరారు. ముఖ్యంగా మున్సిపాలిటీ ఎన్నికల్లో ఇల్లందులో కాంగ్రెస్ పార్టీ గెలిచిన తీరును ముఖ్యమంత్రికి వివరించారు. ఇల్లందు మున్సిపల్ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ తరపున ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.




# మహిళా సాధికారతలో చారిత్రాత్మక ఘట్టం

- రాష్ట్రవ్యాప్తంగా 8 వేల స్త్రీ శక్తి భవనాలకు శంకుస్థాపన
- మహిళల అభివృద్ధితోనే రాష్ట్ర ఆర్థిక ప్రగతి సాధ్యం
- 2034 నాటికి కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దుతాం
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**కొత్తగూడెం కలెక్టరేట్, మే 25,(ప్రజాజ్యోతి)** తెలంగాణలో మహిళా సాధికారతను మరింత బలోపేతం చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ప్రజా పాలన – ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న మహిళా వారోత్సవాల్లో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సచివాలయం నుంచి ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క , మంత్రులు సీతక్క ,దుద్దిల్లా శ్రీధర్ బాబు ,పొంగులేటి శ్రీనివాస రెడ్డి ,ఎంపీ వేం నరేంద్ర రెడ్డి, శాసనసభ్యులు తదితరులతో కలిసి వర్చువల్ విధానంలో రాష్ట్రవ్యాప్తంగా 8 వేల ఇందిరా గాంధీ స్త్రీ శక్తి భవనాలకు శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ మహిళల అభివృద్ధి సాధించినప్పుడే రాష్ట్రం ఆర్థికంగా బలపడుతుందని అన్నారు, తెలంగాణ ఆడబిడ్డల ఆశీర్వాదంతో ప్రజా ప్రభుత్వం ఏర్పడిందని, మహిళల సంక్షేమం, ఆర్థిక స్వావలంబన కోసం ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నారు. ఒకేసారి 8 వేల స్త్రీ శక్తి భవనాలకు శంకుస్థాపన చేయడం దేశంలోనే చారిత్రాత్మక నిర్ణయమని తెలిపారు. ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ఆర్టీసీలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని అమలు చేశామని, ఇప్పటివరకు ఆ పథకం

మిగతా 2 లో...

# ఆర్టీసీ డ్రైవర్ ప్రాణాలతో పోరాటం



అదనపు విధులే ఆర్టీసీ డ్రైవర్‌కు శాపమయ్యాయా..?

రెండు కాళ్లకు శస్త్రచికిత్స... ఆర్టీసీ డ్రైవర్ దయనీయ స్థితి

- ఆర్టీసీ బస్సు స్టీరింగ్ పట్టిన చేతికి ఇప్పుడు ఆసరా కావాలి
- భార్యా పిల్లల భవిష్యత్తుపై ఆందోళన
- ఆర్థిక సహాయం కోసం బాధిత కుటుంబం ఎదురుచూపు

**టేకుల పల్లి, మే2 5 , ప్రజాజ్యోతి:** ఆర్టీసీ లో పని చేస్తూ డ్యూటీ పూర్తయింది... ఇంటికి వెళ్లొచ్చు అనుకున్న ఆ డ్రైవర్ జీవితాన్ని ఒక్క ఆదేశం అతలాకుతలం చేసింది. అదనపు డ్యూటీకి వెళ్లిన ఆర్టీసీ ఔట్‌సోర్సింగ్ డ్రైవర్ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి మంచాన పడగా...ఇప్పుడు అతని కుటుంబం కన్నీటి జీవితాన్ని గడుపుతోంది. విధి నిర్వహణలో ప్రాణాలు పణంగా పెట్టిన డ్రైవర్‌ను ఆర్టీసీ యాజమాన్యం పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా

మిగతా 2 లో...

# మావోయిస్టుల భారీ డంప్ స్వాధీనం

- ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్రలో మావోయిస్టుల సామాగ్రి స్వాధీనం
- 1000 డిటోనేటర్లు, రైఫిళ్లు, భారీగా ఆయుధాలు ,పేలుడు పదార్థాలు స్వాధీనం



**చర్ల , మే 25 :(ప్రజాజ్యోతి ):** తెలంగాణ సరిహద్దు రాష్ట్రాలైన మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని కాంకేర్–నారాయణ్‌పూర్ సరిహద్దు అటవీ ప్రాంతాల్లో నిర్వహించిన మావోయిస్టు వ్యతిరేక ఆపరేషన్లలో భద్రతా బలగాలకు మరోసారి కీలక విజయం లభించింది. లొంగిపోయిన మావోయిస్టులు అందించిన గోప్య సమాచారంతో పోలీసులు, డీఆర్‌జీ, బీఎస్ఎఫ్, బీడీఎస్ బృందాలు సంయుక్తంగా ముమ్మర కూంబింగ్ చేపట్టి అడవుల్లో భూగర్భంలో దాచిపెట్టిన భారీ మొత్తంలో ఆయుధాలు, పేలుడు పదార్థాలు, ఆయుధ తయారీ సామగ్రిని స్వాధీనం చేసుకున్నాయి. గడ్చిరోలి జిల్లా పోమ్‌కే– బినాగుండ అటవీ ప్రాంతంలో

మిగతా 2 లో...

# గిరిజన విద్యాలయాల్లో మౌలిక వసతులు కల్పించాలి

- రాష్ట్ర గిరిజన సంక్షేమ ప్రత్యేక కార్యదర్శి సంతోష్



**భద్రాచలం టౌన్ , మే 25 , ప్రజాజ్యోతి** గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాలు, గురుకులాలు, పీఎంహెచ్ వసతిగృహాలలో మౌలిక వసతుల కల్పన త్వరితగతిన పూర్తి చేయాలని గిరిజన సంక్షేమ ప్రత్యేక కార్యదర్శి సంతోష్ ఆదేశించారు. సోమవారం హైదరాబాద్ గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్ కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లాల వారీగా ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ప్రత్యేక కార్యదర్శి సంతోష్ మాట్లాడుతూ గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడపబడుతున్న పాఠశాలలు, వసతి గృహాలు, గురుకుల పాఠశాలలు, కళాశాలలు, పి ఎం హెచ్ వసతిగృహాలలో

మిగతా 2 లో...

## గిరిజన విద్యాలయాల్లో మౌలిక వసతులు కల్పించాలి

(మొదటి పేజీ తరువాయి...)

చదువుతున్న విద్యార్థులకు చదువుతోపాటు అన్ని వసతి సౌకర్యాలు కల్పించడానికి నిధులు విడుదల అయినందున సంబంధిత డిటిడివోలు తప్పనిసరిగా విద్యార్థినీ విద్యార్థుల పోస్ట్మెట్రిక్ స్కాలర్షిప్ పెండింగ్ లేకుండా అన్ని కళాశాలలలో చదువుతున్న పిల్లలకు అందే విధంగా చూసి కళాశాల నుంచి క్లియరెన్స్ సర్టిఫికెట్ తీసుకోవాలని అన్నారు. రాష్ట్రంలోని అలాగే జెన్ భాగి దారి అభియాన్ పథకం కింద మారుమూల గిరిజన గ్రామాలలో చేపట్టిన కార్యక్రమాల సంబంధించిన ప్రతిపాదనలు త్వరితగతిన పంపించాలని అన్నారు. అలాగే గిరిజన సంక్షేమ శాఖ వీలు, డిఇలు ,ఏఈలు కేంద్రం మరియు స్టేట్ గవర్నమెంట్ ద్వారా విడుదలయ్యే 275 ఆర్టికల్ కింద మంజూరైన నిధులతో ఈ సంవత్సరం 100% అన్ని పాఠశాలల్లో ముఖ్యంగా బాలికల పాఠశాలల్లో మరుగుదొడ్లు మరియు టాయిలెట్లు, కాంపౌండ్ వాల్స్ నిర్మాణం పూర్తి అయ్యేలా చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పివిటిజి అధికారి గన్యా నాయక్, సిబ్బంది కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

## 50 శాతం రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు

- నేడు ఎమ్మెల్యే జారే చేతుల మీదుగా పంపిణీ ప్రారంభం

**దమ్మపేట,మే.25(ప్రజాజ్యోతి):** దమ్మపేట మండలంలోని రైతులకు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో 50 శాతం రాయితీపై పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సీఈఓ, విశాల సహకార సంఘం, దమ్మపేట ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో దాదాపు తొమ్మిది వేల ఎకరాల్లో వరి సాగు జరుగుతున్న నేపథ్యంలో రైతుల భూముల్లో సేంద్రియ కర్బనం పెంపు లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు పేర్కొన్నారు. ఈ పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం ఉదయం 8 గంటలకు దమ్మపేట సొసైటీ కార్యాలయంలో అశ్వారావుపేట శాసనసభ్యులు జారే ఆదినారాయణ ప్రారంభించనున్నట్లు తెలిపారు. మండలానికి 500 క్వింటాళ్ల జీలుగులు, 120 క్వింటాళ్ల జనుము విత్తనాలు అందినట్లు వెల్లడించారు. జీలుగులు విత్తనాల 30 కేజీల బస్తా పూర్తి ధర రూ.4905 కాగా, 50 శాతం సబ్సిడీతో రైతులు రూ.2452.50 చెల్లించి పొందవచ్చన్నారు. అలాగే జనుము విత్తనాల 40 కేజీల బస్తా పూర్తి ధర రూ.6220 కాగా, రైతులు రూ.3110 చెల్లించి పొందవచ్చని తెలిపారు. ఈ విత్తనాలను సన్న, చిన్నకారు రైతులకు మాత్రమే అందజేయనున్నట్లు పేర్కొన్నారు. రైతులు తమ వెంట పట్టాదార్ పాస్ పుస్తకం, ఆధార్ కార్డు జిరాక్స్ ప్రతులతో దమ్మపేట సొసైటీ కార్యాలయానికి వచ్చి వ్యవసాయ విస్తరణ అధికారుల వద్ద నమోదు చేసుకుని విత్తనాలు పొందవచ్చని సూచించారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సీఈఓ, విశాల సహకార సంఘం, దమ్మపేట కోరారు.

## వడదెబ్బతో వృద్ధుడు మృతి



**ములకలపల్లి, మే 25, ప్రజాజ్యోతి:** వడదెబ్బకు గురై ఓ వృద్ధుడు మృతి చెందిన ఘటన మండలంలో సోమవారం చోటుచేసుకుంది. స్థానిక ఎస్సై మధుప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని జగన్నాథపురం గ్రామానికి చెందిన ముత్తిని నరసింహారావు (70) ఆదివారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో తన కిరాణా దుకాణంలో ఉండగా ఒక్కసారిగా కిందపడిపోయారు. వెంటనే కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ములకలపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రికి, అనంతరం కొత్తగూడెంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో సోమవారం ఖమ్మంకు తీసుకెళ్తుండగా మార్గమధ్యలో నరసింహారావు మృతి చెందారు. మృతుడి కుమారుడు ముత్తిని శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మధుప్రసాద్ తెలిపారు.

## క్షణికావేశంలో యువకుడి ఆత్మహత్య

**ములకలపల్లి, మే 25, ప్రజాజ్యోతి:** క్షణికావేశనికి గురై మద్యం మత్తులో యువకుడు ఆత్మహత్య చేసుకున్న విషాద ఘటన సోమవారం మండలంలో చోటు చేసుకుంది. స్థానిక ఎస్సై మధుప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. ఇర్పా రాజు (20) చిన్నప్పటి నుంచే కుటుంబ పరిస్థితుల కారణంగా తల్లిదండ్రులకు దూరంగా ఉంటూ కొంతకాలం తండ్రి వద్ద, మరికొంతకాలం తల్లి వద్ద, ఎక్కువగా అమ్మమ్మ వద్ద నివసించేవాడు. అశ్వాపురం మండలం మామిళ్లవాయి గ్రామంలో జరిగే వేల్పుల పండుగకు వెళ్లాలని యువకుడు తన అమ్మమ్మను అడిగాడు. అయితే పండుగకు ఇంకా నెలరోజుల సమయం ఉందని ఆమె చెప్పడంతో, మద్యం మత్తులో క్షణికావేశానికి గురైన రాజు ఆదివారం సాయంత్రం 5 గంటల సమయంలో ఇంటి నుంచి వెళ్లిపోయాడు. సోమవారం ఉదయం గ్రామ శివారులో చెట్టుకు ఉరివేసుకున్న స్థితిలో గ్రామస్తులకు కనిపించాడు. మృతుని తల్లి ఇర్పా భద్రమ్మ పోలీసులకు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై తెలిపారు.

# మహిళా సాధికారతలో చారిత్రాత్మక ఘట్టం

(మొదటి పేజీ తరువాయి...)



కోసం రూ.10 వేల కోట్లను ఆర్టీసీకి చెల్లించినట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు. మహిళా సంఘాల బ్యాంక్ లింకేజీ రుణ పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచుతున్నామని తెలిపారు. ఇప్పటికే మహిళా సంఘాలకు రూ.60 వేల కోట్ల రుణాలు అందించామని, సున్నా వడ్డీ రుణాల కోసం ప్రభుత్వం రూ.1390 కోట్లు విడుదల చేసిందన్నారు. మహిళా సంఘాలు రైస్ మిల్లులు, గోదాములు, లాజిస్టిక్ పార్కులు స్థాపించి వ్యాపార రంగంలో ముందు కు రావాలని సీఎం సూచించారు. అవసరమైతే 100 ఎకరాల వరకు ప్రభుత్వ భూములు కేటాయించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. భవిష్యత్తులో ధాన్యం నిల్వల నిర్వహణను మహిళా సంఘాల ఆధ్వర్యంలో చేపట్టేలా చర్యలు తీసుకుంటామని అన్నారు . మహిళా శక్తి సూపర్ బజార్లను కార్పొరేట్ స్థాయిలో అభివృద్ధి చేసి ప్రముఖ రిటైల్ సంస్థలకు పోటీగా తీర్చిదిద్దాలని సూచించారు. పట్టణ ప్రాంతాల్లో సూపర్ బజార్ల ఏర్పాటుకు ప్రభుత్వ భూములను తక్కువ ధరకు లీజుకు అందజేస్తామని హామీ ఇచ్చారు. ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని ప్రస్తావిస్తూ, ప్రస్తుతం అందిస్తున్న చీరలకు మహిళల నుంచి విశేష ఆదరణ లభిస్తోందన్నారు. 2034 నాటికి రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఐడిఓసి కార్యాలయం సమావేశ మందిరం నుంచి జిల్లా కలెక్టర్ అంకిత్ , స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారిని స్వర్ణలత లేనినా, జిల్లా సమాఖ్య, మండల సమాఖ్య సభ్యులతో కలిసి పాల్గొన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మహిళా సంఘాల బలోపేతానికి ఇందిరా గాంధీ స్త్రీ శక్తి భవనాలు కీలకంగా మారనున్నాయని తెలిపారు. జిల్లాలోని 471 గ్రామ పంచాయతీలకు గాను 321 వివో భవనాలకు ప్రభుత్వం మంజూరు కల్పించిందన్నారు. ఇప్పటికే 70 భవనాల నిర్మాణ పనులు వివిధ దశల్లో కొనసాగుతుండగా, సోమవారం మరో 138 భవనాలకు భూమిపూజ కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. ప్రస్తుతం మొత్తం 222 భవనాల నిర్మాణ పనులు పురోగతిలో ఉన్నాయని అన్నారు . భవనాల నిర్మాణ పనులను నాణ్యతతో, వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గ్రామ స్థాయిలో మహిళా సంఘాల సమావేశాలు, శిక్షణ కార్యక్రమాలు, ఉపాధి అవకాశాల అభివృద్ధికి ఈ భవనాలు కేంద్రాలుగా ఉపయోగపడతాయని కలెక్టర్ తెలిపారు.

## మావోయిస్టుల భారీ డంప్ స్వాధీనం

(మొదటి పేజీ తరువాయి...)

నిర్వహించిన ప్రత్యేక ఆపరేషన్లో మావోయిస్టులు రహస్యంగా ఏర్పాటు చేసిన ఆయుధ తయారీ కేంద్రాన్ని భద్రతా బలగాలు గుర్తించాయి. ఈ సందర్భంగా లేథ్ మెషిన్, బీజీఎల్ పైపులు, 12 బోర్ పైపులు, ఇన్వర్టర్, జనరేటర్, బ్యాటరీలు, గ్రైండింగ్ డ్రిల్లింగ్ మెషిన్లు, జిగ్సా మెషిన్, ప్రెజర్ పంప్, సోలార్ ప్యానెల్స్, భారీ ఇనుప పైపులు సహా అనేక వస్తువులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సామగ్రిని మావోయిస్టులు ఆయుధాల తయారీతో పాటు భద్రతా బలగాలపై దాడులకు వినియోగించేందుకు సిద్ధం చేసినట్లు అధికారులు వెల్లడించారు. అనంతరం బీడీడీఎస్ బృందం అక్కడికక్కడే పేలుడు పదార్థాలు, ఇతర ప్రమాదకర సామగ్రిని ధ్వంసం చేసింది. పోలీస్ సూపరింటెండెంట్ ఎం. రమేష్ మార్గదర్శకత్వంలో ప్రత్యేక ఆపరేషన్ బృందం, బీడీడీఎస్ సిబ్బంది ఈ చర్యలను విజయవంతంగా నిర్వహించారు. ఛత్తీస్గఢ్లోని కాంకేర్–నారాయణ్పూర్ సరిహద్దు ప్రాంతాల్లో కూడా భద్రతా బలగాలు విస్తృత గాలింపు చర్యలు చేపట్టాయి. పల్లాహూర్–జపమార్క గ్రామాల మధ్య ఉన్న అటవీ, కొండ ప్రాంతాల్లో నిర్వహించిన ఆపరేషన్లో భూగర్భంలో దాచిపెట్టిన నక్సల్స్ డంప్ను గుర్తించారు. అక్కడి నుంచి ఒక నాటు బీజీఎల్ లాంచర్, 25 బీజీఎల్ సెల్స్, నాలుగు ఇంప్రొవైజ్డ్ ఫైర్ కాట్రిడ్జులు, ఏకే–47 ఖాళీ కాట్రిడ్జ్, 5 కిలోల గన్పౌడర్, 10 కాటన్ బాంబులు, నక్సల్ యూనిఫాంలు, సోలార్ ఛార్జర్, 50 అడుగుల వైర్లు, మెడికల్ కిట్ తదితర సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా ఛోటేబెతియా పోలీస్ స్టేషన్ పరిధిలోని మార్కబేడ, అద్నార్, ఏలూరు గ్రామాల అడవుల్లో నిర్వహించిన మరో ఆపరేషన్లో 12 బోర్ రైఫిళ్లు , ఒక బీజీఎల్ లాంచర్, ఆరు బీజీఎల్ సెల్స్, 800 ఎలక్ట్రిక్ డిటోనేటర్లు, 200 విద్యుత్ రహిత డిటోనేటర్లు, గన్పౌడర్, నక్సల్ యూనిఫాం, ఇతర పేలుడు సామగ్రిని భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. భారీ సంఖ్యలో డిటోనేటర్లు లభించడం భద్రతా వర్గాలను అప్రమత్తం చేసింది. ఈ మొత్తం ఆపరేషన్ను డీఆర్జీ కాంకేర్ సబ్ఇన్స్పెక్టర్ విజయ్ కుల్దీప్, డీఆర్జీ నారాయణ్పూర్ అసిస్టెంట్ సబ్ఇన్స్పెక్టర్ నరేంద్ర ఠాకూర్, బీఎస్ఎఫ్ కమాండర్ రోహితాష్ నేతృత్వంలోని సంయుక్త బృందం సమన్వయంతో విజయవంతంగా నిర్వహించింది. కూంబింగ్ సమయంలో భద్రతా బలగాలు అడవిలో ప్రతి ప్రాంతాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసి అనుమానాస్పద ప్రాంతాల్లో గాలింపును మరింత ముమ్మరం చేశాయి. నక్సల్ ప్రభావిత సరిహద్దు ప్రాంతాల్లో పోలీసులు, భద్రతా బలగాలు నిరంతరం సంయుక్త ఆపరేషన్లు నిర్వహిస్తున్నాయని అధికారులు తెలిపారు. భద్రతా దళాల ఒత్తిడి పెరగడంతో మావోయిస్టుల కార్యకలాపాలు క్రమంగా బలహీనపడుతున్నాయని పేర్కొన్నారు. ప్రజల భద్రత కోసం అడవీ ప్రాంతాల్లో గాలింపు చర్యలు కూంబింగ్ ఆపరేషన్లు మరింత విస్తృతంగా కొనసాగుతాయని అధికారులు తెలియచేసారు .





## ఆర్టీసీ డ్రైవర్ ప్రాణాలతో పోరాటం

(మొదటి పేజీ తరువాయి...)

టేకులపల్లి మండలం చంద్ర తండా గ్రామపంచాయతీ పరిధిలోని సూర్య తండాకు చెందిన ధరావత్ రవి అలియాస్ రాజు కొత్తగూడెం డిపోలో ఆర్టీసీ ఔట్సోర్సింగ్ బస్సు డ్రైవర్గా పనిచేసినట్లు తెలిపారు. మార్చి 26వ తేదీన రోజంతా విధులు నిర్వహించిన రవి రాత్రి 9 గంటలకు ఇంటికి వెళ్లేందుకు సిద్ధమవుతుండగా, ఏ.డి. సి అధికారి డి. ఏమ్ మేడం ఆదేశాలు... అదనపు డ్యూటీకి భద్రాచలం వెళ్లాలి అని ఆదేశాలు జరిచేసినట్లు కుటుంబ సభ్యులు చెప్పారు. విధుల పట్ల నిబద్ధతతో భద్రాచలం వెళ్లి తిరిగి కొత్తగూడెం వస్తుండగా నవభారత్ సమీపంలోని కేసీమ్ బంక్ వద్ద బస్సు ప్రమాదానికి గురైందని పేర్కొన్నారు. ఈ ప్రమాదంలో రవికి రెండు కాళ్లు తీవ్రంగా దెబ్బతినగా పొత్తికడుపులో కూడా తీవ్రమైన గాయాలు అయ్యాయి. వెంటనే ఖమ్మంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారని అన్నారు. వైద్యులు రెండు కాళ్లకు ఆపరేషన్లు చేయడంతో పాటు కడుపులో దెబ్బతిన్న చిన్న పేగును తొలగించి శస్త్రచికిత్స చేసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఇప్పటికే చికిత్స కోసం దాదాపు రూ.10 లక్షలు ఖర్చు అయ్యాయని అప్పుల పాలయ్యామని వారు వాపోయారు. ప్రస్తుతం రవి మంచాన పడి ఉండగా భార్య మరియు ఇద్దరు చిన్న పిల్లలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కుటుంబానికి ఆధారంగా ఉన్న రవి ఈ పరిస్థితికి చేరుకోవడంతో ఇంట్లో విషాదం నెలకొందని అన్నారు. ఆర్టీసీ డ్యూటీలో ఉండగానే ప్రమాదం జరిగిందని ... అయినా ఆర్టీసీ యాజమాన్యం నుంచి సరైన సహాయం లేదని కనీసం తమ కుటుంబ పరిస్థితిని చూసి ఆదుకోవాలి అంటూ బాధిత కుటుంబం కన్నీటి పర్యంతమవుతోంది. విధి నిర్వహణలో ప్రమాదానికి గురైన ఔట్సోర్సింగ్ డ్రైవర్కు ఆర్టీసీ యాజమాన్యం తక్షణ ఆర్థిక సాయంతో పాటు పూర్తి వైద్య సహాయం అందించి కుటుంబాన్ని ఆదుకోవాలని స్థానికులు, గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.





# లైసెన్స్ సర్వేయర్లకు గౌరవ వేతనం ప్రకటించాలి

- ఎకరానికి రూ.50తో కుటుంబ పోషణ కష్టసాధ్యం
- కనీస పని భరోసా కల్పించాలని డిమాండ్
- ఈ నెల 26న చలో హైదరాబాద్
- ఇందిరా పార్క్ ధర్నా చౌక్‌లో ఆత్మగౌరవ సభ విజయవంతం చేయాలని పిలుపు



**కొత్తగూడెం, మే 25 ( ప్రజాజ్యోతి )** రాష్ట్ర ప్రభుత్వం తమకు అధికారికంగా లైసెన్సులు జారీ చేసి రెవెన్యూ సంబంధిత పనులు చేయించుకుంటున్నప్పటికీ తగిన వేతనాలు ఇవ్వకుండా నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తోందని తెలంగాణ రెవెన్యూ లైసెన్స్ సర్వేయర్స్ అసోసియేషన్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ జెల్ది శామ్ ఆవేదన వ్యక్తం చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని ఐడిఓసి కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. లైసెన్స్ సర్వేయర్లు ప్రభుత్వానికి కీలక సేవలు అందిస్తున్నప్పటికీ తమ కష్టానికి తగిన గౌరవం దక్కడం లేదని అన్నారు. ప్రభుత్వ శాఖల పనుల్లో భాగస్వాములుగా వ్యవహరిస్తూ ప్రజలకు సేవలు అందిస్తున్న తమ పరిస్థితి ప్రస్తుతం దయనీయంగా మారిందని పేర్కొన్నారు. ప్రస్తుతం అమలులో ఉన్న ఎకరానికి రూ.50 కమీషన్ విధానం వల్ల కుటుంబ పోషణ భారంగా మారిందని పెరుగుతున్న నిత్యావసర ఖర్చుల నడుమ ఆ ఆదాయం జీవనోపాధికి సరిపోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తమ సేవలను వినియోగించుకుంటూ కనీస ఆర్థిక భరోసా కూడా కల్పించకపోవడం బాధాకరమన్నారు. లైసెన్స్ సర్వేయర్లకు కనీస పని భరోసాతో పాటు గౌరవ వేతనం ప్రకటించాలని డిమాండ్ చేశారు. తాము ఎలాంటి అధిక ప్రయోజనాలు కోరుకోవడం లేదని కేవలం చేసిన పనికి తగిన గుర్తింపు గౌరవప్రదమైన జీవనం కోసం అవసరమైన వేతనం మాత్రమే కోరుతున్నామని స్పష్టం చేశారు. సర్వేయర్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ఈ నెల 26న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. హైదరాబాదులోని ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వద్ద నిర్వహించే లైసెన్స్ సర్వేయర్స్ అసోసియేషన్ ఆత్మగౌరవ సభను విజయవంతం చేయాలని రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సర్వేయర్లకు పిలుపునిచ్చారు. భారీ సంఖ్యలో సర్వేయర్లు పాల్గొని తమ ఐక్యతను చాటాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి లైసెన్స్ సర్వేయర్ల సమస్యలను పరిష్కరించాలని గౌరవ వేతనం ప్రకటించి ఆర్థిక భరోసా కల్పించాలని డిమాండ్ చేశా రు. ఈ సమావేశంలో తెలంగాణ రెవెన్యూ లైసెన్స్ సర్వేయర్స్ అసోసియేషన్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు గుగులోత్ విక్రమ్ కుమార్, జనరల్ సెక్రటరీ కబీర్ దాస్ తదితరులు పాల్గొన్నారు.

# కోర్టు విధులు బహిష్కరించిన భద్రాచలం న్యాయవాదులు



**భద్రాచలం టౌన్ , మే 25 ప్రజాజ్యోతి** భద్రాచలంలో సోమవారం భద్రాచలం బార్ అసోసియేషన్‌కు చెందిన న్యాయవాదులు హైదరాబాద్‌లో న్యాయవాది ఖాజా మోయినుద్దీన్ హత్యకు నిరసనగా కోర్టు విధులను బహిష్కరించి నిరసన తెలిపారు. అనంతరం న్యాయవాదులంతా సమావేశమై ఖాజా మోయినుద్దీన్ కు శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా భద్రాచలం బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పూసాల శ్రీనివాసాచారి మాట్లాడుతూ ఖాజా మోయిన్ ఉద్దీన్‌పై జరిగిన దారుణ హత్య యావత్ న్యాయవ్యవస్థకే తీరని లోటని, ఈ అమానుష ఘటనను బార్ అసోసియేషన్ తీవ్రంగా ఖండిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. సమాజంలో శాంతిభద్రతలను కాపాడేందుకు బాధితులకు న్యాయం చేకూర్చేందుకు నిరంతరం శ్రమించే న్యాయవాదులపై ఇలాంటి దాడులు జరగడం అత్యంత విచారకరమన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు తాతా లలిత, పేరాల వెంకటేశ్వర్లు, బండారు అరుణ్‌చంద్, అవులూరి సత్యనారాయణ, భజన సతీష్, ఎం.వి. రమ, సాధనపల్లి సతీష్, పాయం రవి వర్మ, ఎస్.మల్లేష్, దాట్ల సంధ్య, బి.రామకృష్ణ పాల్గొన్నారు.

# గిరిజన దర్బార్ లో సమర్పించిన అర్జీలు త్వరితగతిన పరిష్కరించాలి

- భద్రాచలం ఐటీడీఏ పీవో బి రాహుల్



**భద్రాచలం టౌన్, మే 25 ప్రజాజ్యోతి** గిరిజనులు గిరిజన దర్బార్ లో సమర్పించిన అర్జీలు త్వరితగతిన పరిష్కరించాలని భద్రాచలం ఐటీడీఏ పీవో బి.రాహుల్ పేర్కొన్నారు. భద్రాచలంలోని ఐటీడీఏ సమావేశ మందిరంలో సోమవారం జరిగిన గిరిజన దర్బార్‌లో పీవో రాహుల్ మాట్లాడుతూ మారుమూల ఆదివాసి గిరిజన గ్రామాల నుండి వచ్చిన గిరిజనుల సమస్యల పరిష్కారంలో వివిధ శాఖల మధ్య యూనిట్ అధికారుల సమన్వయం అత్యంత కీలకమని అన్నారు. ప్రతి వినతిపత్రాన్ని బాధ్యతాయుతంగా పరిశీలించి తక్షణ చర్యలు చేపట్టాలని సంబంధిత శాఖల యూనిట్ అధికారులను ఆదేశించారు. తక్షణ పరిష్కారం సాధ్యమయ్యే సమస్యలను వెంటనే పరిష్కరించాలని, మిగిలిన సమస్యలను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆయన యూనిట్ అధికారులకు సూచించారు. గిరిజన దర్బార్లో గిరిజనులు సమర్పించిన దరఖాస్తులను ఆన్లైన్ ద్వారా ప్రత్యేకమైన రిజిస్టర్లో నమోదు చేసి, అర్హులైన ప్రతి గిరిజనులకు విడతలవారీగా ప్రభుత్వం ప్రవేశ పెట్టే సంక్షేమ పథకాలు అందించడానికి కృషి చేస్తానని ఆయన అన్నారు. అనంతరం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారి వద్ద నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్, డిడి ట్రైబల్ వెల్ఫేర్ అశోక్, గురుకులం ఆర్ సి ఓ అరుణకుమారి, ఎస్ డి సి ఆనందకుమార్, ఈ ఈ ట్రైబల్ వెల్ఫేర్ మధుకర్, ఏడి ఎంహెచ్వో సైదులు పాల్గొన్నారు.

# న్యాయవాదులు విధుల బహిష్కరణ



**ఇల్లందు, మే 25, ప్రజాజ్యోతి:** తెలంగాణ హైకోర్టు సీనియర్ న్యాయవాది ఖాజా మొయినుద్దీన్ (63) హైదరాబాద్‌లోని మాసబ్‌ట్యాంక్‌లో కారుతో ఢీకొట్టి దారుణంగా హత్యకు గురైన ఘటనను నిరసిస్తూ సోమవారం ఇల్లందు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు నల్ల బ్యాడ్జీలు ధరించి విధులను బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఇల్లందు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు భూక్య రవికుమార్ నాయక్ మాట్లాడుతూ మే 23న పక్కా ప్లాన్ ప్రకారం దుండగులు ఉదయం నుండే లాయర్ ఇంటి సమీపంలో మాటు వేసి రెక్కీ నిర్వహించారని తెలిపారు. లాయర్ కాజా మొహీనుద్దీన్ తన ఇంటి బయట కారు ఎక్కుతున్న సమయంలో నెంబర్ ప్లేట్ లేని స్కార్పియో కార్ తో నిందితులు అతనిని బలంగా ఢీకొట్టారని పేర్కొన్నారు. తీవ్ర గాయాల పాలైన లాయర్ ను వెంటనే ఆసుపత్రి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. కబ్జాకు గురవుతున్న వక్ఫ్ బోర్డు ఆస్తులు, భూముల రక్షణ కోసం లాయర్ కాజా మొయినుద్దీన్ దశాబ్దాలుగా కోర్టులలో చట్టపరమైన పోరాటం చేస్తున్నారన్నారు. ఈ భూమి మీదలే హత్యకు ప్రధాన కారణమని పోలీసులు భావిస్తున్నట్లు తెలిపారు. లాయర్ కాజా మోహినిద్దీన్ పై దాడి జరగడం ఆరవసారి అని కుటుంబ సభ్యులు చేరుకుంటున్నారని అన్నారు. వక్ఫ్ బోర్డు ఆస్తులను ఆక్రమించి కాలేజీలు నిర్మించిన ఒక రాజకీయ నాయకుడి పై తమకు అనుమానం ఉందని ఆరోపించారు. ఈ దారుణ హత్యను నిరసిస్తూ కేసును లోతుగా విచారించడానికి ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్ ) ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

# అంగన్ వాడీ కేంద్రంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక మహిళా వారోత్సవాలు



**భద్రాచలం టౌన్ , మే 25 ప్రజాజ్యోతి** గర్భిణులు, బాలింతలు. చిన్నపిల్లల్లో పోషకాహారలోపాన్ని నివారించడమే ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక మహిళా వారోత్సవాలు ముఖ్య ఉద్దేశమని భద్రాచలం సెక్టార్ సిడిపిఓ జ్యోతి అన్నారు. సోమవారం నాడు భద్రాచలం సెక్టార్ పరిధిలోని ఎస్ ఆర్ ఎన్ కాలనీ అంగన్ వాడీ కేంద్రంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక మహిళా వారోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దైనందిన జీవితంలో స్థానికంగా లభించే కూరగాయలు, ఆకుకూరలు, పప్పుధాన్యాలు, పోషకాలతో కూడిన ఆహారాన్ని భాగం చేసుకోవాలని ఆమె తల్లులకు అవగాహన కల్పించారు. అనంతరం కేంద్రానికి వచ్చిన తల్లులందరితో పిల్లల ఆరోగ్యం, సంరక్షణ మరియు సరైన పోషణపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం సెక్టార్ పరిధిలోని సూపర్‌వైజర్ అనసూయ, చంద్రకళ ,అంగన్ వాడీ టీచర్లు, హెల్పర్లు పాల్గొన్నారు.

# ఆళ్ళపల్లి, మర్కోడు గ్రామాల్లో మహిళా శక్తి భవనాలకు భూమిపూజ



**ఆళ్ళపల్లి.మే25.ప్రజా జ్యోతి** ఆళ్ళపల్లి మండలంలో మహిళా సాధికారత దిశగా కీలక అడుగు పడింది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహిళల కోసం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన పలు భవనాల నిర్మాణాలకు మండలంలోని భూమి పూజ, శంకుస్థాపన కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు.ఆళ్ళపల్లి మండలకేంద్రంలో గ్రామ సర్పంచ్ వాసం సుష్మిత. మర్కోడు గ్రామ పంచాయతీ సర్పం చ్ సుతారీ రమాదేవి. ఉపసర్పంచ్ వగలబోయిన సతీష్.మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ప్రభుత్వ నిధులతో చేపట్టనున్న (వీఓ ) బిల్డింగ్స్, మండల సమాఖ్య (MS) బిల్డింగ్, MS గోడౌన్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ సీనియర్ నాయకులు. (ఏపీఎం ) లు. (సీసీ)లు. (ఎన్ఆర్ఈజీఎస్ )సభ్యులు మహిళా సమైక్య సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ముత్తంగి అలంకారంలో దర్శనమిచ్చిన రామయ్య

**భద్రాచలం టౌన్, మే 25 ప్రజాజ్యోతి** భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారు సోమవారం ముత్తంగి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సమయంలో అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. అలాగే నిత్యకల్యాణ మండపంలో స్వామి వారి నిత్య కల్యాణం వైభవంగా జరిగింది. విశ్వక్సేన అర్చన, పుణ్యాహవచనం, కంకణదారణ, జీలకరబెల్లం, మాంగల్యదారణ, తలంబ్రాలు, వేద ఆశీర్వచనం నిర్వహించారు. భద్రాచలంకు చెందిన దొడ్డిపట్ల కోటేష్ దుర్గ భ్రమరాంబ దంపతులు పెళ్లి రోజు సందర్భంగా సందర్భంగా భద్రాద్రి రామయ్యను దర్శించుకొని రూ.20వేలు విలువ చేసే రెండు వాటర్ ఫ్రిడ్జ్ లు, అన్నదాన పథకంకు రూ.30,116లు అందజేశారు.



## ఘనంగా ప్రతిభా సత్కార మహోత్సవం



**ఇల్లందు, మే 25, ప్రజాజ్యోతి:** ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో ప్రతిభా సత్కార మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మండలంలోని వివిధ పాఠశాలల నుండి పదవ తరగతి ప్రధమ, ద్వితీయ స్థానాలు సాధించిన విద్యార్థులతో పాటు మండల స్థాయిలో ప్రతిభ కనబరిచిన టాపర్స్ ను ప్రత్యేకంగా సన్మానించి మెమెంటోలు, ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో దన్ సింగ్, యంఈఓ ఉమా శంకర్ లు మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు నిర్దేశించుకుని క్రమశిక్షణతో చదువులో ముందుకు సాగాలని, సమాజానికి ఆదర్శంగా నిలవాలని సూచించారు. కొందరి దాతల సహకారంతో ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ రీజనల్ ప్రెసిడెంట్ యండి నవాబు షా, నేషనల్ కోఆర్డినేటర్ (సర్వీస్ విభాగం) ప్రసాద్, కర్ణ, క్లబ్ ప్రెసిడెంట్ రమేష్, ఇగ్నిటర్స్ ఆఫ్ ప్రెసిడెంట్ నాగరాజు, కామన్ ఫార్మర్స్ ఫోరం సభ్యుడు బి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

## సినీ కొరియోగ్రాఫర్ పొదిల శ్యామ్ కు ఘన సన్మానం







**ఇల్లందు, మే 25, ప్రజాజ్యోతి:** హైదరాబాదులోని భాస్కర ఆడిటోరియంలో జరిగిన ప్లానెట్-డి కార్యక్రమంలో ఇల్లందుకు చెందిన సినీ కొరియోగ్రాఫర్ పొదిల శ్యామ్ ను సోమవారం రాష్ట్ర ప్రభుత్వ గద్దర్ ఉత్తమ చిత్రం అవార్డు గ్రహీ త, రాజు వెడ్స్ రాంబాయి చిత్ర దర్శకుడు కాంపాటి సాయిలు, చిత్ర నిర్మాత వేణు చేతుల మీదుగా ఉత్తమ నృత్య దర్శకుడు అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా సినీ కొరియోగ్రాఫర్ శ్యామ్ మాట్లాడుతూ తన ప్రతిభను గుర్తించి అవార్డు ఇచ్చిన ప్లానెట్-డి సంస్థకు, గద్దర్ అవార్డు గ్రహీత, రాజు వెడ్స్ రాంబాయి దర్శకుడు కాంపాటి సాయిలు, నిర్మాత వేణు చేతుల మీదుగా ఈ అవార్డు అందుకోవడం సంతోషకరమన్నారు. ఈ ప్రోత్సాహంతో రానున్న రోజుల్లో మరిన్ని అవార్డులు అందుకునేందుకు నిరంతరం కృషి చేస్తానని తెలిపారు.

## వడదెబ్బతో వృద్ధురాలి మృతి



**చర్ల, మే 25:(ప్రజాజ్యోతి):** చర్ల మండలం కలివేరు గ్రామానికి చెందిన మజ్జురి పెంటమ్మ (70) వడదెబ్బ కారణంగా మృతిచెందిన ఘటన గ్రామంలో విషాదాన్ని నింపింది. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం పెంటమ్మ ఆదివారం మధ్యాహ్నం వడదెబ్బకు గురై అస్వస్థతకు లోనయ్యారు అని అనంతరం పరిస్థితి విషమించడంతో ఆమెను భద్రాచలం ఆసుపత్రికి తీసుకొని వెళ్లామని తీవ్ర అస్వస్థత కారణంగా భద్రాచలం వెళ్లిన ఫలితం లేకుండా మృతిచెందినట్లు తెలిపారు.ఇటీవల మండల వ్యాప్తంగా ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతున్న కారణంగా వడదెబ్బతో వృద్ధులు మృతి చెందుతున్నారు. మొన్న మేడివాయి కాలనీకి చెందిన వెంకన్న ,నిన్న కోరుగడ్డ పైన గుర్తు తెలియని మృతదేహం వడదెబ్బతో మృతిచెందగా నేడు కలివేరులోని పెంటమ్మ ఎండ దెబ్బకి మృతి చెందింది.వృద్ధులు, చిన్నారులు అత్యవసర పరిస్థితులు ఉంటే తప్ప బయటకు రావద్దని వైద్యులు , అధికారులు సూచిస్తున్నారు.

# దళిత సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి

- ప్రజావాణిలో జాయింట్ కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించిన ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్



**కొత్తగూడెం, మే 25 (ప్రజాజ్యోతి)** స్థానిక జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో దళిత సమస్యల పరిష్కారానికి సంబంధించి భారతరత్న అంబేద్కర్ సంక్షేమ సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు, అభ్యుదయ కళా సేవ సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ జాయింట్ కలెక్టర్ డి. వేణుగోపాల్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా భారతరత్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి ఉత్సవాల నిర్వహణ కోసం ప్రతి జిల్లాకు రూ.5 లక్షల నిధులు కేటాయించాలని కోరారు. మరమ్మతులు జరుగుతున్న అంబేద్కర్ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి అదనపు నిధులు మంజూరు చేసి ఆధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం కమ్యూనిటీ హాల్ నిర్వహణ బాధ్యతలను మున్సిపల్ కార్పొరేషన్‌కు అప్పగించి అంబేద్కర్ కమిటీ హాల్ అభివృద్ధి కమిటీ సహకారంతో ప్రజాస్వామ్య పద్ధతిలో నిర్వహించాలని సూచించారు. హెడ్ పోస్టాఫీస్ సెంటర్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహాల ప్రాంగణాన్ని అంబేద్కర్ సెంటర్ గా నామకరణం చేయాలని దీనిపై మున్సిపల్ కార్పొరేషన్‌లో అధికారిక తీర్మానం చేయాలని కోరారు. అంబేద్కర్ విగ్రహాల వద్ద రాజకీయ ఫ్లెక్సీలు, హోర్డింగ్లు, పార్టీ జెండాలు ఏర్పాటు కాకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అలాగే సర్కిల్ లోని అంబేద్కర్ విగ్రహం వద్ద భారీ లైటింగ్ ఏర్పాటు చేసి గతంలో ఉన్నట్లుగా రంగురంగుల ఫౌంటెన్‌ను పునరుద్ధరించాలని కోరారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో నిజ నిర్ధారణతో చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని 1/70 ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజనేతర దళితులకు కూడా సమాన విద్యా, ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. దళితులకు మూడు ఎకరాల భూమి కేటాయించడంతో పాటు వారి భూములు అన్యాక్రాంతం కాకుండా రక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. ఈ సమస్యలపై ఇప్పటికే ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, కార్పొరేషన్ మేయర్ గణేష్, మున్సిపల్ కమిషనర్ సుజాతలకు వినతి పత్రాలు సమర్పించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ డి. వేణుగోపాల్ స్పందిస్తూ... సమస్యలన్నింటినీ జిల్లా కలెక్టర్, రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కార దిశగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అపరబాలు అల్లి శంకర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండా రమేష్, జిల్లా నాయకులు సుంద్రు రఘునాథ్ బాబు, బొమ్మెర అశోక్, పృథ్వీరాజ్, సలిగంటి శ్రీను, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు సమన్వయంతో పనిచేయాలి

- అదనపు కలెక్టర్ వేణుగోపాల్

**కొత్తగూడెం కలెక్టరేట్, మే 25,(ప్రజా జ్యోతి)** ఐడిఓసి కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్ ప్రజల నుండి వినతులు, ఫిర్యాదులను స్వీకరించి సమగ్రంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ పద్మ, జిల్లా ఉపాధి కల్పన శాఖ అధికారి శ్రీరామ్ పాల్గొన్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి ప్రజలు అధిక సంఖ్యలో హాజరై తమ సమస్యలను అదనపు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారంలో శాఖల మధ్య సమన్వయం కీలకమని తెలిపారు. ప్రతి వినతిపత్రాన్ని పరిశీలించి తక్షణ చర్యలు చేపట్టాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ప్రజావాణిలో స్వీకరించిన కొన్ని దరఖాస్తులుపాల్వంచ శేఖర్ బంజరకు చెందిన చెరుకుపల్లి పద్మ తాను గత 15 సంవత్సరాలుగా రేకుల గుడిసెలో నివసిస్తున్నానని, సొంత స్థలం ఉన్నప్పటికీ ప్రజాపాలన కార్యక్రమంలో ఇందిరమ్మ ఇల్లు కోసం దరఖాస్తు చేసుకున్నా ఇప్పటివరకు మంజూరు కాలేదని పేర్కొంటూ ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరారు. దరఖాస్తును పరిశీలించిన అదనపు కలెక్టర్ తగు చర్యల నిమిత్తం గృహ నిర్మాణ శాఖ అధికారికి ఎండార్స్ చేశారు.ములకలపల్లి గ్రామానికి చెందిన గాదె మోహన్ రెడ్డి సర్వే నంబర్ 119లో 2 ఎకరాలు 17 గుంటల భూమికి పట్టాదారు పాస్ పుస్తకం కోసం దరఖాస్తు చేసుకున్నప్పటికీ ఇప్పటివరకు మంజూరు కాలేదని, దీంతో రైతుబంధు తదితర ప్రభుత్వ పథకాల లబ్ధి పొందలేక పోతున్నానని తెలిపారు. త్వరితగతిన పాస్ పుస్తకం మంజూరు చేయాలని కోరుతూ చేసిన దరఖాస్తును పరిశీలించి తగు చర్యల నిమిత్తం సంబంధిత విభాగానికి ఎండార్స్ చేశారు.చుంచుపల్లి మండలానికి చెందిన మంగమ్మ ఆసరా పెన్షన్‌పై జీవనం సాగిస్తున్నానని, ప్రజాపాలన సభలో గృహజ్యోతి పథకం కింద ఉచిత విద్యుత్ కోసం దరఖాస్తు చేసుకున్నప్పటికీ ఇంకా విద్యుత్ బిల్లులు వస్తున్నాయని పేర్కొంటూ ఉచిత విద్యుత్ మంజూరు చేయాలని కోరారు. దరఖాస్తును పరిశీలించిన అదనపు కలెక్టర్ తగు చర్యల నిమిత్తం విద్యుత్ శాఖ అధికారులకు ఎండార్స్ చేశారు.దమ్మపేట మండలం పట్వారిగూడెం గ్రామానికి చెందిన రాములు సర్వే నంబర్లు 413, 425, 439, 638/1లో వ్యవసాయ భూమి ఉన్నదని, ఆ భూములకు వారసత్వ పట్టా పాస్ పుస్తకాల కోసం దమ్మపేట తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నప్పటికీ ఇప్పటివరకు మంజూరు కాలేదని తెలిపారు. తమ తండ్రి నుండి వారసత్వంగా సంక్రమించిన భూములకు తమ పేర్లపై పట్టా పాస్ పుస్తకాలు మంజూరు చేయాలని కోరుతూ చేసిన దరఖాస్తును పరిశీలించి తగు చర్యల నిమిత్తం దమ్మపేట తహసీల్దార్‌కు ఎండార్స్ చేశారు.ఈ కార్యక్రమంలో అన్ని శాఖలకు చెందిన జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.





## సమతుల్య ఆహారంపై అవగాహన కార్యక్రమం





**చర్ల, మే 25(ప్రజా జ్యోతి ):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా చర్ల మండలంలోని వివిధ గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న అంగన్వాడీ కేంద్రాల్లో సోమవారం పోషకాహార అవగాహన కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. గ్రామీణ ప్రాంత ప్రజల్లో పోషకాహారంపై అవగాహన పెంపొందించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు.ఈ సందర్భంగా అంగన్వాడీ కేంద్రాల్లో స్థానికంగా లభించే వివిధ రకాల ఆహార పదార్థాలను ప్రదర్శించారు. జొన్నలు, రాగులు, సజ్జలు, పప్పుధాన్యాలు, ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు వంటి ఆహార పదార్థాల్లో ఉన్న పోషక విలువలను అంగన్వాడీ సిబ్బంది గ్రామస్తులకు వివరించారు. ముఖ్యంగా చిన్నారులు, గర్భిణీలు, బాలింతలు సమతుల్య ఆహారం తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు.అదేవిధంగా స్థానికంగా లభించే ఆహార పదార్థాలతో అనేక రకాల వంటకాలను తయారు చేసి ప్రదర్శించారు. పోషకాహారంతో కూడిన వంటకాల తయారీ విధానాలను మహిళలకు చూపించి అవగాహన కల్పించారు. కొన్ని అంగన్వాడీ కేంద్రాల్లో మహిళల కోసం వంటల పోటీలు నిర్వహించగా గ్రామ మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. పోటీల్లో పాల్గొన్న మహిళలు తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు అందించే వంటకాలను తయారు చేసి ప్రదర్శించారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు మాట్లాడుతూ పిల్లల ఎదుగుదలలో పోషకాహారం కీలక పాత్ర పోషిస్తుందని ఇంట్లో లభించే ధాన్యాలు, కూరగాయలు, ఆకుకూరలతోనే మంచి ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పోషకాహార లోపం నివారించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని తెలిపారు.ఈ కార్యక్రమాల్లో మహిళలు, గ్రామస్తులు, అంగన్వాడీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

# మీసేవ సేవల ధృవీకరణకు భౌతిక పత్రాలు అవసరం లేదు

- ఆన్‌లైన్‌లో అప్లోడ్ చేసిన పత్రాలనే పరిశీలించాలి
- జిల్లా అదనపు కలెక్టర్ వేణుగోపాల్



**కొత్తగూడెం కలెక్టరేట్, మే 25, (ప్రజా జ్యోతి)**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మీసేవ సేవలను మరింత వేగవంతంగా, ప్రజలకు అందించేందుకు ప్రభుత్వం పలు చర్యలు చేపట్టిందని జిల్లా అదనపు కలెక్టర్ వేణుగోపాల్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఆదాయ, కుల, నివాస, కుటుంబ సభ్యుల ధృవపత్రాలు, ఇబీసీ , ఓబీసీ తదితర సేవల ధృవీకరణ కోసం ఈ ఎస్ డి అభివృద్ధి చేసిన జిపిఓస్ , ఎం ఆర్ ఎల్ ఎస్, వెరిఫికేషన్ సెల్ నెంబర్ అప్లికేషన్ అమలులో ఉందని తెలిపారు. ఈ యాప్ ద్వారా సంబంధిత అధికారులు మీసేవ దరఖాస్తు వివరాలు, అప్లోడ్ చేసిన పత్రాలను ఆన్‌లైన్‌లో పరిశీలించి, అర్హత ఆధారంగా ఆమోదం లేదా తిరస్కరణ నిర్ణయాలు తీసుకునే విధానం అమల్లో ఉన్నదన్నారు.ఈ నేపథ్యంలో మీసేవ దరఖాస్తుల పరిశీలన కోసం ప్రజల నుండి ఎలాంటి భౌతిక పత్రాలను స్వీకరించరాదని స్పష్టం చేశారు. మండల, గ్రామ స్థాయిలో విధులు నిర్వహిస్తున్న అధికారులు కూడా భౌతిక పత్రాలను కోరరాదని సి సి ఎల్ ఏ కార్యాలయం ఇప్పటికే స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు.ప్రజలు మీసేవ దరఖాస్తులకు సంబంధించిన పత్రాలను ఆన్‌లైన్‌లో అప్లోడ్ చేసిన అనంతరం ఎలాంటి భౌతిక పత్రాలను అధికారులకు లేదా సిబ్బందికి అందజేయవద్దని సూచించారు.జిల్లా పరిపాలన ఈ ఆదేశాలను కచ్చితంగా అమలు చేయాలని సంబంధిత అధికారులకు సూచనలు జారీ చేసినట్లు తెలిపారు. ప్రజలకు వేగవంతమైన, పారదర్శకమైన, ఇబ్బందు లేని సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.మీసేవ సేవలకు సంబంధించిన సమస్యలు ఎదురైనట్లయితే సంబంధిత మండల అధికారులను లేదా జిల్లా మీసేవ మేనేజర్లను సంప్రదించాలని సూచించారు. సంప్రదించవలసిన ఫోన్ నంబర్లు కృష్ణమూర్తి – 9133122022రాకేష్ – 9000420792 ఈ –డిస్ట్రిక్ట్ మేనేజర్ సైదేశ్వర రావు 7337340825 ను కూడా సంప్రదించవచ్చని తెలిపారు.

## పోరు కేక సభకు భారీగా తరలిరావాలి

- తుడుందెబ్బ రాష్ట్ర నాయకుడు వాసం ముసలయ్య పిలుపు



**చర్ల, మే 25(ప్రజా జ్యోతి ):** చర్ల మండల కేంద్రంలోని తుడుందెబ్బ కార్యాలయ ప్రాంగణంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో జూన్ 3న పాకాల కొత్తగూడలో జరిగే "పోరు కేక" సభకు ఆదివాసీ ప్రజలు భారీ సంఖ్యలో తరలి రావాలని తుడుందెబ్బ రాష్ట్ర నాయకుడు వాసం ముసలయ్య పిలుపునిచ్చారు.గొండ్వాన సంక్షేమ పరిషత్ వర్కింగ్ ప్రెసిడెంట్ పూనెం వరప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ముసలయ్య మాట్లాడుతూ, 1976లో లంబాడీ, సుగాలి, బంజారా వర్గాలను అక్రమంగా ఆదివాసీల జాబితాలో చేర్చారని ఆరోపించారు. దీంతో ఆదివాసీల రిజర్వేషన్లు, రాజకీయ అవకాశాలు, అస్తిత్వం దెబ్బతింటోందని ఆవేదన వ్యక్తం చేశారు.గతంలో భద్రాచలం వేదికగా ధర్మయుద్ధం చేపట్టి ప్రభుత్వాల దృష్టికి సమస్యను తీసుకెళ్లినా, పాలకులు ఆదివాసీల సమస్యలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. గత 50 ఏళ్లుగా ఆదివాసీ జాతి తమ హక్కుల కోసం పోరాటాలు చేస్తున్నప్పటికీ ప్రభుత్వాలు స్పందించడం లేదని విమర్శించారు.జూన్ 3న జరిగే "పోరు కేక" సభ ద్వారా ఆదివాసుల ఐక్యత, బలం ప్రభుత్వాలకు తెలియజేయాలని ఆయన పిలుపునిచ్చారు. పాకాల కొత్తగూడలో జరిగే సభను విజయవంతం చేయడానికి ఆదివాసీ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. తుడుందెబ్బ నాయకులు తాటి రామకృష్ణ, తాటి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## ఫీజుల దోపిడీపై పిడిఎస్ యూ సమరభేరి

- తెలంగాణలో ఫీజుల నియంత్రణ చట్టం తేవాలి
- ప్రభుత్వాన్ని శాసిస్తున్న కార్పొరేట్ విద్యా సంస్థలు
- భద్రాద్రి కొత్తగూడెంలో విస్తృతంగా సంతకాల సేకరణ
- నిరసనల్లో పాల్గొన్న విద్యార్థులు, తల్లిదండ్రులు




**భద్రాచలం టౌన్, మే 25, ప్రజాజ్యోతి** రాష్ట్రంలో ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల ఫీజుల దోపిడీని అరికట్టాలని, ప్రభుత్వం వెంటనే ఫీజుల నియంత్రణ చట్టాన్ని తీసుకురావాలని డిమాండ్ చేస్తూ పిడిఎస్ యూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు ఉధృతమయ్యాయి. ఈ క్రమంలోనే జిల్లా కేంద్రంలో పిడిఎస్ యూ భారీ సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించింది.

**ప్రభుత్వంపై విమర్శలు...** ఈ సందర్భంగా పిడిఎస్ యూ జిల్లా కార్యదర్శి మునిగేలా శివ ప్రశాంత్ మాట్లాడుతూ.. విద్యా వ్యవస్థను కార్పొరేట్ శక్తులు తమ గుప్పిట్లోకి తీసుకున్నాయని మండిపడ్డారు. శ్రీ చైతన్య, నారాయణ వంటి కార్పొరేట్ విద్యా సంస్థల నుంచి వచ్చే ఎలక్టోరల్ బాండ్లు, భారీ ఫండ్స్ కారణంగా ప్రభుత్వాలు వాటిని నియంత్రించే సాహసం చేయడం లేదని ఆరోపించారు. ప్రభుత్వాలే విద్యా సంస్థల కనుసన్నల్లో నడుస్తున్నాయని, దీనివల్ల సామాన్య, మధ్యతరగతి తల్లిదండ్రులు తీవ్ర ఆర్థిక భారానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

**అడ్డగోలుగా ఫీజుల పెంపు....** ఏటా ఎటువంటి అనుమతులు లేకుండానే పాఠశాలలు, కళాశాలలు 25 నుంచి 50 శాతం మేర ఫీజులు పెంచుతున్నా, క్షేత్రస్థాయిలో ఉన్న ఎంఈఓలు, డిఈఓలు, ఆర్ జేడీలు పట్టించుకోవడం లేదని, పైగా అక్రమ అనుమతులకు కొమ్ముకాస్తున్నారని శివ ప్రశాంత్ విమర్శించారు. ఫీజులు పెంచే అధికారం యాజమాన్యాలకు కాకుండా, తల్లిదండ్రుల కమిటీలకు ఉండాలని, వారి ఆమోదం తప్పనిసరి చేసేలా ప్రభుత్వం ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలని ఆయన డిమాండ్ చేశారు.

**ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం....** సంతకాల సేకరణ ద్వారా సేకరించిన ప్రజాభిప్రాయాన్ని ప్రభుత్వానికి నివేదిస్తామని, ఈ సమస్య పరిష్కారమయ్యే వరకు రాష్ట్రవ్యాప్తంగా పోరాటాన్ని ఉధృతం చేస్తామని పిడిఎస్ యూ నాయకులు స్పష్టం చేశారు. విద్య అనేది వ్యాపారం కాదని, అది ప్రతి విద్యార్థి ప్రాథమిక హక్కు అని వారు గుర్తు చేశారు.ఈ కార్యక్రమంలో పిడిఎస్ యూ జిల్లా కమిటీ సభ్యులు రామ్ చరణ్, ఏవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సాధనపల్లి సతీష్, జిల్లా కమిటీ సభ్యులు వాసు, పెద్ద సంఖ్యలో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సామాజిక కార్యకర్తలు పాల్గొన్నారు.

## కే ఓసీలో రోడ్డు సమస్యలు, మరమ్మత్తులు చేయాలి

- టిప్పర్ అసోసియేషన్ అధ్యక్షులు నెలవెల్లి నరసింహారావు



**టేకులపల్లి,మే25,ప్రజాజ్యోతి:** ఇల్లందు ఏరియా టేకులపల్లి మండల కే ఓ సిలో బంకర్, కాట నుండి బయటికి వచ్చే రహదారులు గ్రావెల్ రోడ్లు గుంటలు పడి, టిప్పర్ స్పెర్ పార్ట్స్, కట్టలు విరిగిపోయి ఆర్థికం యాజమాన్యం నష్టపోతున్నారు అని వారు అన్నారు. అట్టి విషయాన్నీ గమనించి సోమవారం టిప్పర్ అసోసియేషన్ అధ్యక్షులు, నెలవెల్లి నరసింహరావు, ఉప అధ్యక్షులు బోడ మంగీలాల్ నాయక్, కార్యదర్శి, అరవ వెంకటేష్, కలిసి కే ఓ సి రహదారులను సందర్శించి అక్కడ ఉన్న రోడ్డు సమస్యలను,మరమ్మతులు తక్షణమే చేయాలనీ స్థానిక సింగరేణి జియం తో, కే ఓ సి పి ఓ తో మాట్లాడడంతో రహదారి సమస్యపై వారు సానుకూలంగ స్పందించి, తక్షణమే మరమ్మతులు చేయిద్దామని తెలిపారని వారు తెలిపారు.ఈ కార్యక్రమంలొ టిప్పర్ ఓనర్స్, వీరన్న, బన్సీలాల్, విజయ్ పాల్గొన్నారు.

## రాజమల్లు వర్ధంతి వేడుకలు



**ఇల్లందు, మే 25, ప్రజాజ్యోతి:** ఇల్లందు మున్సిపల్ మాజీ చైర్మన్ చొప్పరి రాజమల్లు వర్ధంతి వేడుకలను సోమవారం పట్టణ కాంగ్రెస్ ఆధ్వర్యంలో కూరగాయల మార్కెట్ వద్ద గల పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ చైర్ పర్సన్ దొడ్డ కిరణ్ మిత్ర డానియల్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు భోళ్ల సూర్యంలు చొప్పరి రాజమల్లు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సందర్భంగా వారు మాట్లాడుతూ చొప్పరి రాజమల్లు మున్సిపల్ చైర్మన్ గా పట్టణ ప్రజలకు సింగరేణి సంస్థతో మాట్లాడి మంచినీరు వచ్చేలా కృషి చేశారని కొనియాడారు. ఐఎన్టీయూసీ సెంట్రల్ నాయకుడిగా సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఎంతో చొరవ చూపారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ జాఫర్, నాయకులు గాలిపల్లి స్వరూప, వెంకటేశ్వర్లు, గందె సదానందం, యండి ఇబ్రహీమ్, దాసు, చెంచమ్మ, ఎర్రసంగి వెంకన్న, పెద్దినేని హరినాథ్ బాబు, వెంకటనారాయణ, వర్మ, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## పాలిసెట్‌లో రాహుల్ విద్యార్థికి స్టేట్ ర్యాంక్

- రాష్ట్రస్థాయిలో ప్రతిభ చాటిన చర్ల విద్యార్థి నిశాంత్





**చర్ల, మే 25(ప్రజాజ్యోతి ):** తెలంగాణ రాష్ట్ర సాంకేతిక విద్యామండలి ఇటీవల విడుదల చేసిన టి జి పాలీసెట్ – 2026 ఫలితాల్లో చర్ల మండల కేంద్రంలోని రాహుల్ విజ్ఞాన్ విద్యాలయం విద్యార్థి పి. నిశాంత్ రెడ్డి రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరిచి పాఠశాలకు, మండలానికి గర్వకారణంగా నిలిచాడు.ఎంబైపీసీ అగ్రికల్చర్ విభాగంలో నిశాంత్ రెడ్డి రాష్ట్రస్థాయిలో 678వ ర్యాంక్ సాధిం చి తన ప్రతిభను చాటుకున్నాడు. ఇప్పటికే పదో తరగతిలో 573 మార్కులతో మండల స్థాయిలో ద్వితీయ స్థానం సాధించిన నిశాంత్, తాజాగా పాలిసెట్‌లో కూడా అత్యుత్తమ ర్యాంక్ సాధించడం విశేషం.ఈ సందర్భంగా సోమవారం పాఠశాల వ్యవస్థాపకులు డాక్టర్ డి.ఎన్. కుమార్, డాక్టర్ ప్రతిభ, ఎడ్యుకేషనల్ డైరెక్టర్ టి.వి.పి.సి. శాస్త్రి నిశాంత్ రెడ్డిని ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం పాఠశాల ప్రిన్సిపాల్ వర్మరాజు, కొసరాజు హరిచరణ్, వైస్ ప్రిన్సిపాల్ యం.వి.యల్. నరసింహారావు, ఉపాధ్యాయులు బిట్రగుంట క్రాంతికుమార్, అద్దంకి బోసుబాబు తదితరులు శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు.నిశాంత్ రెడ్డి మొదటి నుంచే క్రమశిక్షణ, పట్టుదలతో చదువుతూ ఉపాధ్యాయుల మార్గదర్శకత్వాన్ని అనుసరించాడని, అతని విజయం పాఠశాలకు మాత్రమే కాకుండా చర్ల మండల ప్రజలందరికీ గర్వకారణమని ఉపాధ్యాయులు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించి తల్లిదండ్రులకు, ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థి తల్లిదండ్రులు, తోటి విద్యార్థులు పాల్గొని నిశాంత్ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు.

## గండుగులపల్లిలో మంత్రి తుమ్మలకు ఘన సత్కారం

- నీలాద్రి దేవాలయానికి టీటీడీ నిధుల మంజూరు..
- ఆలయ అభివృద్ధిలో మంత్రి తుమ్మల సేవలు మరువలేనివి : కమిటీ సభ్యులు



**దమ్మపేట,మే.25(ప్రజాజ్యోతి):** పెనుబల్లి మండలానికి ప్రసిద్ధి చెందిన నీలాద్రి దేవాలయ అభివృద్ధికి టీటీడీ ద్వారా మూడు కోట్ల రూపాయల నిధులు మంజూరు కావడంలో కీలక పాత్ర పోషించిన రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వర రావును నీలాద్రి దేవాలయ కమిటీ సభ్యులు దమ్మపేట మండల పరిధిలోని గండుగులపల్లి గ్రామంలో ఘనంగా సన్మానించారు. నీలాద్రి దేవాలయ అభివృద్ధికి నిధులు కేటాయించవలసిందిగా రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) చైర్మన్ బీఆర్ నాయుడును కోరగా, దేవాలయ అభివృద్ధి కోసం టీటీడీ మూడు కోట్ల రూపాయల నిధులను కేటాయిస్తూ జీవో విడుదల చేసిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మంత్రి తుమ్మలను కలిసి తమ కృతజ్ఞతలు, అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ నీలాద్రి స్వామి దేవాలయ అభివృద్ధి కోసం గతంలో కూడా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రోడ్లు, విద్యుత్ సదుపాయాలు, ఆలయ అభివృద్ధి పనులకు విశేష సహకారం అందించారని గుర్తు చేశారు.భవిష్యత్తులో కూడా నీలాద్రి దేవస్థానం మరింత అభివృద్ధి చెందేందుకు తన వంతు పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కమిటీ సభ్యులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నీలాద్రి దేవాలయ కమిటీ చైర్మన్, సభ్యులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మహిళా సాధికారతకు మరో ముందడుగు

- మహిళా సమాఖ్య భవనానికి ఎమ్మెల్యే జారె శంకుస్థాపన



**దమ్మపేట,మే.25(ప్రజాజ్యోతి):** అశ్వారావుపేట నియోజకవర్గం దమ్మపేట మండలం గుండుగులపల్లి గ్రామంలో మహిళా సమాఖ్య భవన నిర్మాణానికి ఎమ్మెల్యే జారె ఆదినారాయణ శంకుస్థాపన చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా ఈ శంకుస్థాపన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ మహిళల అభివృద్ధి, సాధికారతే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. మహిళలు ఆర్థికంగా, సామాజికంగా మరింత బలోపేతం కావడానికి మహిళా సమాఖ్య భవనాలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. మహిళా సంఘాల సమావేశాలు, స్వయం ఉపాధి శిక్షణలు, ఉపాధి అవకాశాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించేందుకు ఈ భవనాలు ఉపయోగపడనున్నాయని అన్నారు.ప్రభుత్వం మహిళలకు అన్ని రంగాల్లో ప్రోత్సాహం అందిస్తూ వారి జీవనోపాధి మెరుగుపడేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతోందని ఎమ్మెల్యే వెల్లడించారు. గ్రామీణ ప్రాంతాల్లో మహిళా సంఘాలు మరింత బలపడాలని, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అలాగే ఎమ్మెల్యే సూచనల మేరకు అశ్వారావుపేట నియోజకవర్గ వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో మహిళా సమాఖ్య భవనాల శంకుస్థాపన కార్యక్రమాలు ఘనంగా నిర్వహించబడ్డాయి.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళా సంఘాల సభ్యులు, గ్రామ పెద్దలు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# జివి మాల్ ఎదురుగా స్తంభిస్తున్న ట్రాఫిక్





- డివైడర్ మూల మలుపు మూసివేయాలని ప్రజల డిమాండ్
- ట్రాఫిక్ సిగ్నల్స్ లేదా ట్రాఫిక్ పోలీస్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి

**చుంచుపల్లి,మే25 ( ప్రజాజ్యోతి )** పట్టణంలోని జివి మాల్ ఎదురుగా తీవ్ర ట్రాఫిక్ సమస్య నెలకొంది. ముఖ్యంగా డివైడర్ వద్ద ఉన్న మూల మలుపు కారణంగా వాహనాలు ఎదురెదురుగా రావడంతో ట్రాఫిక్ స్తంభించి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రతిరోజూ భారీగా వాహనాల రద్దీ ఉండటంతో అక్కడ పరిస్థితి మరింత దారుణంగా మారుతోంది. రోడ్లపై విచ్చలవిడిగా వాహనాలు పార్కింగ్ చేయడం కూడా ట్రాఫిక్ సమస్యకు ప్రధాన కారణంగా మారింది. ఇరువైపులా నిలిపే వాహనాల వల్ల ఎదురుగా వచ్చే వాహనాలు స్పష్టంగా కనిపించకపోవడంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదే ప్రదేశం లో అనేక మార్లు బైక్‌లు మరియు ఇతర వాహనాలు ఢీకొనే ఘటనలు జరుగుతున్నాయని వాహనదారులు చెబుతున్నారు.డివైడర్ వద్ద ఉన్న మూల మలుపును తక్షణమే మూసివేస్తే ప్రమాదాలు తగ్గడంతో పాటు ట్రాఫిక్ సమస్య కూడా కొంతవరకు పరిష్కారం అవుతుందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. అదేవిధంగా అక్కడ ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేయాలని లేకపోతే ట్రాఫిక్ నియంత్రణ కోసం ప్రత్యేకంగా ట్రాఫిక్ పోలీసులను నియమించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ప్రజమాదాలకు కేంద్రంగా మారుతున్న ఈ ప్రాంతంపై సంబంధిత అధికారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## మహిళా సంఘాల బలోపేతానికి సమాఖ్య భవనం

- అన్నపురెడ్డిపల్లిలో మహిళా సమాఖ్య భవనానికి శంకుస్థాపన



**అన్నపురెడ్డిపల్లి, మే 25, ప్రజా జ్యోతి:** అశ్వారావుపేట నియోజకవర్గం అన్నపురెడ్డిపల్లి మండలంలో ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ఆదేశాల మేరకు మహిళా సాధికారతకు ప్రాధాన్యతనిస్తూ మహిళా సమాఖ్య భవన నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి చేపట్టిన కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ లాకావత్ లక్ష్మి, ఉపసర్పంచ్ మారగాని అశోక్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పర్సా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మహిళల ఆర్థిక, సామాజిక అభివృద్ధే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. మహిళా సమాఖ్య భవనాలు మహిళా సంఘాల సమావేశాలు, స్వయం ఉపాధి శిక్షణలు, అవగాహన కార్యక్రమాలకు కేంద్రాలుగా ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళా సంఘాల సభ్యులు, గ్రామ పెద్దలు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## న్యాయవాదులకు రక్షణ కల్పించాలి

- సీనియర్ హైకోర్టు అడ్వకేట్ ఖాజా మొహినూద్దీన్ హత్య దుర్మార్గం : లక్కినేని నరేంద్రబాబు
- నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపిన దమ్మపేట బార్ అసోసియేషన్



**దమ్మపేట , మే 25, ప్రజాజ్యోతి :** సీనియర్ హైకోర్టు న్యాయవాది ఖాజా మొహినూద్దీన్ హత్య దారుణమని, న్యాయవాదుల భద్రత కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని దమ్మపేట బార్ అసోసియేషన్ సెక్రెటరీ లక్కినేని నరేంద్రబాబు డిమాండ్ చేశారు.ఖాజా మొహినూద్దీన్ హత్యకు నిరసనగా సోమవారం దమ్మపేట బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నరేంద్రబాబు మాట్లాడుతూ, న్యాయవాదులపై జరుగుతున్న దాడులు ఆందోళన కలిగిస్తున్నాయని అన్నారు. న్యాయవ్యవస్థకు సేవలందిస్తున్న అడ్వకేట్లకు తగిన రక్షణ కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు. ఖాజా మొహినూద్దీన్ హత్య కేసులో నిందితులను కఠినంగా శిక్షించాలని, భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో దమ్మపేట బార్ అసోసియేషన్‌కు చెందిన భోగి నాగమల్లేశ్వరరావు, బాలరాజు, ఉదయ్ కుమార్, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

## ప్రతి పేదవారికి సంక్షేమ పథకాలు అందాలి

- మున్సిపాలిటీలో ప్రజా సమస్యలపై పోరాటం చేద్దాం
- కార్పొరేట్ శక్తులకు తొత్తులుగా పనిచేస్తున్న కేంద్ర ప్రభుత్వం
- ప్రజా వ్యతిరేక విధానాలను ప్రభుత్వాలు మానుకోకపోతే తగిన మూల్యం చెల్లిస్తారు.... సయ్యద్ సలీమ్...సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు




**అశ్వారావుపేట, మే 25, ప్రజాజ్యోతి :** ప్రతి పేదవారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని, మున్సిపాలిటీలో నెలకొన్న ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటాలు నిర్వహించాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు సయ్యద్ సలీమ్ పిలుపునిచ్చారు. ఆదివారం అశ్వారావుపేటలోని పార్టీ నియోజకవర్గ కార్యాలయం మియాజాని భవన్ లో అశ్వారావుపేట మండల పట్టణ కౌన్సిల్ సమావేశం మండల కార్యదర్శి వగ్గెల అర్జున్ రావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో సలీమ్ మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా వ్యవహరిస్తోందని కార్పొరేట్ శక్తులకు తొత్తులుగా పనిచేస్తుందని ఆరోపించారు. పేద, మధ్యతరగతి ప్రజల సమస్యలను పట్టించుకోకుండా ప్రజా వ్యతిరేక విధానాలను అమలు చేస్తోందన్నారు. పెరుగుతున్న ధరలు, నిరుద్యోగం, మౌలిక సదుపాయాల లోపం వంటి సమస్యలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. మున్సిపాలిటీలో తాగునీరు, పారిశుధ్యం, రోడ్లు, డ్రైనేజీ వంటి సమస్యల పరిష్కారానికి ప్రజలతో కలిసి పోరాటాలు చేపడతామని తెలిపారు. ప్రజా సంక్షేమాన్ని విస్మరించిన ప్రభుత్వాలకు ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు కన్వీనర్ రామకృష్ణ పట్టణ కార్యదర్శి లోకవరపు విజయకాంత్ సహాయ కార్యదర్శి సయ్యద్ జాకీర్ మహిళా నాయకురాలు చీపుర్ల సత్యవతి, రిజ్వానా రోహిణి శ్రావణి మార్తిన సత్యవతి పార్టీ నాయకులు, చెన్నారావు, వెంకన్న, ప్రసాద్, విజయ్, శ్రీను, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

## గంగమ్మ, మండేలయ్య గుళ్ళ దగ్గర బోరు ఏర్పాటు

- పినపాక శాసనసభ్యులు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో





**అశ్వాపురం, మే 25, ప్రజా జ్యోతి పత్రిక** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలం, గ్రామ పంచాయతీ పరిధిలోని కొమ్ముగూడెం వద్ద గంగమ్మ తల్లి మరియు మండేలయ్య గుళ్ళ వద్ద హ్యాండ్ బోర్ కావాలని యాదవసంఘం మరియు రాజకసంఘం నాయకులు పినపాక శాసనసభ్యులు శ్రీ పాయం వెంకటేశ్వర్లు విజ్ఞప్తి చేయగా ప్రత్యేక చొరవతీసుకుని వెంటనే హ్యాండ్ బోరు మంజూరు చేపించారు. గుడి వద్ద జరిగే కార్యక్రమాల సమయంలో నీటి సదుపాయం లేక భక్తులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకుల ద్వారా MLA పాయం వెంకటేశ్వర్లు చెప్పగానే స్పందించి సోమవారం బోరు వేయించినందుకు రజకసంఘం మరియు యాదవ సంఘాల నాయకులు, రైతులు, గ్రామ ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తూ MLA పాయం కు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో అశ్వాపురం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఓరుగంటి బిక్కమ్మయ్య, సీనియర్ నాయకులు గాదే కేశవరెడ్డి, ఓరుగంటి రమేష్ బాబు, వేములపల్లి రమేష్, కొమ్ముగూడెం సర్పంచ్ కుంజా జాను నాయకులు గొల్లపల్లి నరేష్, కోలా శశికాంత్, యాదవ సంఘం నాయకులు మద్ది పెద్దిరాజు, నక్కనబోయిన పాపారావు, ముట్టిబోయిన వెంకన్న, చింతల రాంబాబు, దగ్గుల మహేష్, నక్కనబోయిన నరేష్, కాసనబోయిన రాములు, బొల్లం అయిలయ్య, నక్కనబోయిన వీరనాగులు, కాసనబోయిన వీరయ్య, నక్కబోయిన లింగయ్య, రజక సంఘం నాయకులు గోకినపల్లి సత్యం, గోకినపల్లి చిన్న సత్యం, దొంతసరపు మల్లయ్య, గోకినపల్లి వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

## పేద విద్యార్థినికి పోలీసుల ఆర్థిక సాయం





**చర్ల, మే 25 :(ప్రజా జ్యోతి):** దుమ్ముగూడెం మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన అపక శ్రీనిధి ఎంబీబీఎస్ సీటు సాధించి ప్రతిభ చాటిన సందర్భంగా చర్ల మండల సీఐ చేతుల మీదుగా ఆర్థిక సహాయం అందజేశారు. చర్ల సీఐ మిత్ర బృందం కలిసి శ్రీనిధికి రూ.30 వేల నగదును అందించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతానికి చెందిన విద్యార్థిని కష్టపడి ఎంబీబీఎస్ సీటు సాధించడం ఎంతో గర్వకారణమని పేర్కొన్నారు. భవిష్యత్తులో మంచి వైద్యురాలిగా ఎదిగి పేద ప్రజలకు సేవ చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నారాయణరావుపేట సర్పంచ్ కల్లూరి ఆదినారాయణ, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు ముర్రం వీరభద్రం, సోడి చలపతి, ఆదివాసీ నాయకులు పాయం సత్యనారాయణ, కల్లూరి కోర్రాజు, కొర్స మరయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఆక్రమణదారులకు ఇరిగేషన్ శాఖ నోటీసులు





**చర్ల, మే 25 :(ప్రజాజ్యోతి):** చర్ల మండలం తేగడ గ్రామపంచాయతీ పరిధిలోని సిక్స్ఎల్ పంట కాలువ ఆక్రమణలపై ఇరిగేషన్ అధికారులు చర్యలు ప్రారంభించారు. రైతులకు సాగునీరు అందించే కాలువలను కొంతమంది ఆక్రమించడంతో అధికారులు రంగంలోకి దిగి పరిశీలనలు నిర్వహించారు.కాలువల కొలతలు పరిశీలించిన అధికారులు, ఎనిమిది మీటర్ల వెడల్పు ఉన్న పంట కాలువలో సుమారు ఐదున్నర మీటర్లు ఆక్రమణకు గురైనట్లు గుర్తించారు. ఈ నేపథ్యంలో ఆక్రమణదారులకు ఇరిగేషన్ శాఖ నోటీసులు జారీ చేసింది. ఆక్రమిత స్థలాన్ని వెంటనే ఖాళీ చేసి కాలువ భూమిని అప్పగించాలని సూచించారు. అలాగే ఆక్రమిత ప్రాంతంలో యథావిధిగా కాలువ నిర్మాణాలు, స్ట్రక్చర్లు ఏర్పాటు చేసేందుకు సహకరించాలని అధికారులు హెచ్చరించారు. నోటీసులను పట్టించుకోకుండా ఆక్రమణలు కొనసాగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఇరిగేషన్ జేఈ సంపత్ తెలిపారు.పంటకాలువలు ఆక్రమణకు గురవడంతో రైతులకు సాగునీటి సరఫరాలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని స్థానిక రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## బాధితురాలికి 'నేస్తం ట్రస్ట్'ఆర్థిక సాయం



**బూర్గంపహాడ్,మే25(ప్రజా జ్యోతి ):** మండలంలోని సారపాకకు చెందిన వంటశాల నర్మద ఇటీవల ప్రమాదానికి గురి కావడంతో రెండు కాళ్ళు,చాతి పక్కటెముకలు విరిగి మంచానికే పరిమితమైంది. విషయం తెలుసుకున్న మోరంపల్లి బంజర్ గ్రామానికి చెందిన నేస్తం వెల్ఫేర్ చారిటబుల్ ట్రస్ట్ స్పందించి సోమవారం రూ.8000 ఆర్థిక సాయంగా అందించారు.ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ బత్తుల రామకొండా రెడ్డి మాట్లాడుతూ నర్మద ప్రభాకర్ కుటుంబ దయనీయ పరిస్థితిని చూసి కొంతమంది దాతలు ముందుకు వచ్చి అందించిన ఆర్థిక సాయంతో పాటు ,అతను మరికొంత అప్పు చేసి భార్య నర్మద కు వైద్యం చేయించాడని అయినప్పటికీ ఆమెకు పూర్తిగా కోలుకోవాలంటే సుమారుగా 5 నుండి 6 నెలలు సమయం పట్టవచ్చని వైద్యులు చెప్పడంతో వైద్య ఖర్చులకు, కుటుంబ పోషణకు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు.ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ చింత అంకిరెడ్డి,గౌరవ సలహాదారులు సంకా సురేష్ ,సభ్యులు దుగ్గిరెడ్డి బాలనారాయణ రెడ్డి ,సోము రఘునాథ రెడ్డి ,జింకల రాంగోపాల్ రెడ్డి ,క్రైపు రాజేందర్ రెడ్డి పాల్గొన్నారు.

## రాజమల్లుకు నివాళులర్పించిన ఇబ్రహీమ్



**ఇల్లందు, మే 25, ప్రజా జ్యోతి:** ఇల్లందు మున్సిపల్ మాజీ చైర్మన్ చొప్పరి రాజమల్లు వర్ధంతిని పురస్కరించుకొని సోమవారం స్థానిక కూరగాయల మార్కెట్ వద్ద గల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జిల్లా కాంగ్రెస్ మైనార్టీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ మహమ్మద్ ఇబ్రహీమ్ ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇల్లందు మున్సిపల్ చైర్మన్ గా రాజంపల్లి మున్సిపాలిటీకి చేసిన సేవలను కొనియాడారు. ప్రజల సమస్యల పరిష్కారించడంలో తనదైన ముద్ర వేసుకున్నారని తెలిపారు.

## ఎండ తీవ్రతకు మహిళ మృతి

**దమ్మపేట, మే 25 (ప్రజాజ్యోతి):** దమ్మపేట మండలం,చలమప్పగూడెం గ్రామానికి చెందిన బండారు నాగమణి ఎండదెబ్బ కారణంగా మృతి చెందిన ఘటన గ్రామంలో విషాదాన్ని నింపింది. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం మూడు రోజుల క్రితం వారి పామాయిల్ తోట అగ్నికి ఆహుతి కావడంతో ఈ నెల 24వ తేదీన నాగమణి తన భర్తతో కలిసి పొలానికి వెళ్లి నీళ్లు పెట్టి తిరిగి మధ్యాహ్నం 3 గంటల సమయంలో ఇంటికి చేరుకున్నారు. అనంతరం ఆమెకు ఒక్కసారిగా కళ్లు తిరిగి వాంతులు కావడంతో ఎండదెబ్బ తగిలిందని కుటుంబ సభ్యులు భావించి వెంటనే సత్తుపల్లి ఆసుపత్రికి తరలించే ప్రయత్నం చేశారు. అయితే మార్గమధ్యంలోనే ఆమె మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.ఈ ఘటనపై మృతురాలి భర్త కోర్రాజులు దమ్మపేట పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు.

## పెంచిన పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు తగ్గించాలి

- పాల్వంచ లో సిపిఐ కార్యకర్తల నిరసన.



**పాల్వంచ, మే 25, ప్రజాజ్యోతి:** కేంద్ర ప్రభుత్వం ఇటీవల పెంచిన పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం పార్టీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక అంబేద్కర్ సెంటర్‌లో నిరసన కార్యక్రమం నిర్వహించారు. పార్టీ పట్టణ కార్యదర్శి పి. తులసీరామ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు దొడ్డ రవికుమార్ మాట్లాడుతూ, వారం రోజుల వ్యవధిలోనే లీటరు పెట్రోల్, డీజిల్‌పై రూ.8 వరకు ధరలు పెంచడం కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు నిదర్శనమని విమర్శించారు. వంటగ్యాస్ ధరలు పెంచడంతో సామాన్య ప్రజలకు నిత్యావసరాల భారం మరింత పెరిగిందని, ఐదు రాష్ట్రాల ఎన్నికలు ముగిసిన వెంటనే ప్రజలపై అదనపు భారాలు మోపడం సరైంది కాదన్నారు. రష్యా, ఇరాన్ వంటి దేశాలు తక్కువ ధరకు చమురు సరఫరా చేస్తామని ముందుకు వచ్చినప్పటికీ, కేంద్ర ప్రభుత్వం అందుకు ప్రాధాన్యత ఇవ్వకుండా ప్రజలపై మోయలేని భారం మోపుతోందని ఆరోపించారు. ఇప్పటికైనా పెంచిన పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని, భవిష్యత్తులో మళ్లీ ధరలు పెరగకుండా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ కార్యవర్గ సభ్యులు కే. సత్య, సత్యవాణి, పట్టణ కమిటీ సభ్యులు వింజ రాములు, రైతు సంఘం నాయకులు దాసరి శంకరన్న, సీనియర్ నాయకులు యాకోబు, ఎస్.కె. రెహమాన్, మౌలానా, బి. కుమారి, సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఏఐకేఎంఎస్ మండల నూతన అధ్యక్ష, కార్యదర్శుల ఎన్నిక





**టేకులపల్లి,మే25,ప్రజాజ్యోతి:** అఖిల భారత రైతుకూలీ సంఘ జిల్లా నాయకులు తుపాకుల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన జనరల్ బాడీ సమావేశంలో టేకులపల్లి మండల నూతన అధ్యక్ష, కార్యదర్శులు ఏకగ్రీవంగా ఎన్నుకోబడడం జరిగిందని తెలిపారు.టేకులపల్లి మండల అఖిల భారత రైతుకూలీ సంఘం అధ్యక్షులుగా గుగులోత్ రాంచందర్, కార్యదర్శులుగా భూక్య హార్జ్య లను ఏకగ్రీవంగా ఎన్నుకోబడడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు మాపై నమ్మకంతో అవకాశం కల్పించిన పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. సంఘం బలోపేతం కోసం మరింత కృషి చేస్తానని వారు అన్నారు.రైతులకు, రైతు కూలీలకు ఎటువంటి సమస్య వచ్చిన ఆ సమస్యను పరిష్కారం చేసేందుకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటామని తెలిపారు. తన మన బేధం లేకుండా పార్టీ కోసం సంఘం కోసం పనిచేస్తామని తెలిపారు.